ఉష్ణోగ్రత
గరిష్ఠం 41.4
కనిష్ఠం 21.6

మూడింటికే..

- పీహెచ్‌సీ నుంచి మధ్యాహ్నం 3 గంటలకు పని నిమిత్తం వెళ్లిపోయిన వైద్యురాలు
- ఆపై సిబ్బంది కూడా ఇంటిముఖం

8



నేటి నుంచి బాబూజీ మహారాజ్ జయంత్యుత్సవాలు

- కన్హా శాంతివనానికి రానున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి జూపల్లి

నందిగామ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆది గురువు బాబూజీ మహరాజ్ 125వ జయంత్యుత్సవాలు నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. బాబూజీ మహరాజ్ జయంతోత్సవాల్లో బుధవారం తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరుకానున్నట్లు వారు తెలిపారు. ఈ వారోత్సవాల్లో దేశవిదేశాల నుంచి సుమారు 25వేల మంది అభ్యాసకులు పాల్గొంటారని తెలిపారు.



తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

యాచారం మండలంలో అధికారుల పర్యటన

- తాటిపర్తిలో లీజుకు ప్రైవేటు బోర్
- నల్లాకు మోటార్ బిగించిన వారికి కౌన్సెలింగ్


తాటిపర్తిలో ప్రైవేటు బోర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజు, యాచారం మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాష్‌లు తెలిపారు. గ్రామాలలో తాగునీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'నీటి వ్యధ.. తీరేదెలా?' కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా వారు మండలంలోని మేడిపల్లి, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలలో పర్యటించి తాగు నీటి సమస్యపై ఆరా తీశారు. తాటిపర్తిలో నీటి సరఫరా కోసం బొక్క జంగారెడ్డికి చెందిన బోర్‌ను లీజుకు తీసుకున్నారు. నెలకు రూ. 10వేల డబ్బు అందించనున్నట్లు అధికారులు రైతుకు హామీ ఇచ్చారు. గ్రామంలో బందం చెరువు సమీపంలో ఉన్న బావిని అధికారులు పరిశీలించారు. గతంలో ఇదే బావి నుంచి గ్రామానికి తాగు నీరందించారని గ్రామస్తులు తెలిపారు. బావి నుంచి గ్రామం వరకు పైప్‌లైన్ ఎయిర్‌వాల్వ్ బిగించడానికి రూ. 20లక్షల మేర డబ్బు వ్యయమవుతుందని డీఈ రాజు, ఎంపీడీవో నరేందర్‌రెడ్డిలు తెలిపారు. దీనిపై కలెక్టర్‌కు నివేదించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కుర్మిద్దలో పర్యటించి నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని పంచాయతీ సిబ్బందిని డీఈ ఆదేశించారు. మేడిపల్లిలో నల్లాకు మోటార్ బిగించి నీరు పట్టుకుంటున్న వారికి ఎంపీడీవో కౌన్సెలింగ్ ఇచ్చారు. నల్లాలకు మళ్లీ మోటార్ పెడితే సీజ్ చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.



వడివడిగా అడుగులు!

అభివృద్ధిలో ఫ్యూచర్ సిటీ పరుగులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. పనులు వేగవంతం చేయడానికి సర్కార్ చర్యలు తీసుకుంటుంది. ఇందుకోసం ప్రత్యేక అధికారిక వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. తాజాగా ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా పూర్వ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకను నియమించింది. అలాగే ఫ్యూచర్ సిటీ అథారిటీలో సిబ్బంది నియామకాలను కూడా త్వరలో చేపట్టనుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన పోస్టులను ప్రభుత్వం ప్రకటించింది. అదేవిధంగా ఫ్యూచర్ సిటీ విస్తరణ పరిధి పెంచాలనే యోచనలో సర్కార్ ఉంది. దీనికోసం మరి కొన్ని గ్రామాలను ఎఫ్‌సీడీఏ పరిధిలోకి తీసుకురావాలని చూస్తుంది. అంతేకాకుండా పారిశ్రామిక అవసరాల కోసం ఫ్యూచర్ సిటీ పరిధిలో దాదాపు మరో 2వేల ఎకరాలకు పైగా భూసేకరణ చేపట్టాలని సన్నాహాలు చేస్తోంది. ఫ్యూచర్ సిటీ, గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణాల కోసం చేపట్టనున్న భూసేకరణలో ఎలాంటి అవాంతరాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది.

- కమిషనర్‌గా శశాంక నియామకం
- వేగవంతం కానున్న పనులు
- సిబ్బంది నియామకాలు షురూ!
- మరింత విస్తరణకు సర్కార్ యోచన
- త్వరలో ప్రత్యేక పోలీస్ కమిషనరేట్!
- సజావుగా భూసేకరణకు చర్యలు
- పరిహారంపై రైతులతో చర్చలు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : నగర శివార్లలో కొత్తగా నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్ సిటీ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. శ్రీశైలం- నాగార్జునసాగర్ హైవేల మధ్యన ఉన్న 56 గ్రామాల్లోని 765 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం దీని గురించి ప్రత్యేకంగా ప్రస్తావించింది. రాష్ట్రానికే కాదు దేశానికే తలమానికంగా ఉండే మొట్టమొదటి నెట్ జీరో ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు చేస్తామని ప్రకటించింది. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాలతో పోటీపడేలా కాలుష్యరహితంగా, అత్యంత ఆధునిక


ఫ్యూచర్ సిటీ కమిషనర్ శశాంక

సదుపాయాలతో దీన్ని నిర్మిస్తున్నామని తెలిపింది. ఇపుడు దీనికనుగుణంగా ప్రభుత్వం దీని నిర్మాణ పనులపై దృష్టిసారించింది. ఫ్యూచర్ సిటీ నిర్మాణ పనులను చూసేందుకు ప్రత్యేక అధికారిక వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. తాజాగా ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా పూర్వ రంగారెడ్డి

మిగతా 8వ పేజీలో...

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో టెక్నిప్ ఎఫ్‌ఎంసీ

- విడిభాగాల తయారీ, పరిశోధన కేంద్రం ప్రారంభం



శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : టెక్నిప్ ఎఫ్ఎంసీ కంపెనీ తన నూతన విడిభాగాల తయారీ, పరిశోధన కేంద్రాన్ని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జీఎంఆర్ ఏరో సిటీలో ప్రారంభించినట్లు మంగళవారం జీఎంఆర్ అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు. జీఎంఆర్ గెయిల్ అనుబంధ సంస్థ అయిన ఏవియేషన్ సెజ్ లిమిటెడ్‌లో 1.02 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 4.11ఎకరాల్లో విస్తరించిన గ్రేడ్-ఏ స్థాయి కేంద్రం నాజూకైన విభాగాలు, సముద్రపు ఉపరితలపు భాగాలు, శక్తి రంగానికి సంబంధించిన ప్రత్యేకమైన పరికరాల పరిశోధన అభివృద్ధి తయారీ అవసరాలను తీర్చేందుకు రూపొందించబడింది. ఉత్తమ రవాణా అనుసంధానాన్ని కలిగి, వ్యూహాత్మక ప్రదేశంలో ఉన్న ఈ కేంద్రం టెక్నిప్ ఎఫ్ఎంసీకి సెజ్ ప్రయోజనాలు అందిస్తోందన్నారు. భద్రత ఆస్తి నిర్వహణ సేవలు, ప్రతిభావంతులైన మానవ వనరులకు ప్రాముఖ్యత, బలమైన లాజిస్టిక్ మద్దతు ఉన్నాయి. టెక్నిప్ ఎఫ్ఎంసీ స్నైడర్ ఎలక్ట్రిక్ సఫ్రన్ ఇంజిన్ ఎంఆర్‌వో, ప్రాట్ అండ్ విట్నీ, అమరరాజా, వంటి గ్లోబల్ దిగ్గజ సంస్థల సరసన జీఎంఆర్ ఏరోసిటీ చేరిందని చెప్పారు. జీఎంఆర్ ఎయిర్‌పోర్టు ల్యాండ్ డెవలప్‌మెంట్ సీఈవో శ్రీఅమన్‌కపూర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న పారిశ్రామిక సముదాయంలో టెక్నిప్ ఎఫ్ఎంసీ ఒకటని చెప్పారు. తక్కువ జనసాంద్రత కలిగిన క్యాంపస్ తరహా అభివృద్ధి, వ్యాపార లాజిస్టిక్స్ మద్దతు, సేవలు సమగ్ర వ్యవస్థను కోరుకునే గ్లోబల్ పారిశ్రామిక నాయకుల కోసం ప్రాధాన్య గమ్యస్థానంగా బలపడిందని పేర్కొన్నారు.


మంత్రికి ఫిర్యాదు చేస్తున్న నవాబుపేట మండల నాయకులు

ఎమ్మెల్యే బెదిరింపు.. ఫిర్యాదు

ఇన్‌చార్జి మంత్రి, పోలీసులకు నవాబ్‌పేట కాంగ్రెస్ నాయకుల కంప్లైంట్

7

'భూ భారతి'పై అవగాహన అవసరం

- కలెక్టర్ నారాయణరెడ్డి

కడ్తాల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): భూమి హక్కుల భద్రత, భూ సమస్యల సత్వర పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి నూతన ఆర్‌వోఆర్-2025 చట్టం తీసుకువచ్చిందని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. రైతుల మేలును కాంక్షించి హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు తీసుకువచ్చిన భూ భారతి చట్టంపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆయన కోరారు. కడ్తాల మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో మంగళవారం నూతన చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టంలో రికార్డుల నిర్వహణకు ప్రతీ గ్రామానికి ఒక గ్రామ రెవెన్యూ పాలన అధికారిని నియమించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జూన్ నెల నుంచి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రతి కమతానికి భూధార్‌కార్డు కేటాయించి దానిలోని హద్దులతో కూడిన మ్యాప్‌ను పొందుపరచనున్నట్లు పేర్కొన్నారు. ధరణిలో పరిష్కారమవ్వక పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాల క్రమబద్ధీకరణకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కరించుకునే వెసులుబాటు ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసమే రాష్ట్రప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ధరణితో ఏళ్ల కాలంగా భూ సమస్యలు పరిష్కారం కాక ఇబ్బంది పడ్డ రైతులకు ఇక విముక్తి కలుగుతుందన్నారు. రైతుల వద్దకే రెవెన్యూ అధికారులు వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రైతుల శ్రేయస్సు, వ్యవసాయ రంగం అభివృద్ధికి

మిగతా 8వ పేజీలో...


కడ్తాలలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

దర్జాగా కబ్జా!

గ్రామకంఠం, బంజరు దొడ్డి భూములు అన్యాక్రాంతం
చోద్యం చూస్తున్న అధికారులు
సర్వే చేసి కాపాడాలంటున్న ప్రజలు


చటాన్‌పల్లిలో కబ్జాకు గురైన బంజరు దొడ్డి స్థలం

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానికి, అంతర్జాతీయ విమానాశ్రయానికి అత్యంత చేరువలో ఉన్న షాద్‌నగర్ నియోజకవర్గంలో భూముల ధరలకు రెక్కలొచ్చి ఎకరం విలువ రూ.కోట్లకు చేరింది. దాంతో కబ్జాదారులు ప్రభుత్వ భూములపై కన్నేశారు. అంతేకాకుండా గ్రామ కంఠం భూములను కూడా వదలడం లేదు. గ్రామాల మధ్యలో ఉన్న గ్రామకంఠం భూములకు కంచెలు ఏర్పాటు చేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు.

చౌలపల్లిలో ఇలా...

ఫరూఖ్‌నగర్ మండలం చౌలపల్లిలో గ్రామం మధ్యలో సుమారు

మిగతా 8వ పేజీలో...

గ్రామకంఠం భూములను కాపాడాలి



గ్రామాల్లో విలువైన బంజరు దొడ్లు, గ్రామ కంఠం భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. వాటిపై సమగ్ర విచారణ జరిపించాలి. అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవాలి. వాటిని కాపాడితే భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతుంది. అధికారులు చొరవ తీసుకోవాలి.

- ఆంజనేయులు, కిషన్‌నగర్



బార్ లైసెన్స్‌ను అందజేస్తున్న డీఆర్వో సంగీత

2–బీ బార్ కోసం డ్రా

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : 2-బీ బార్ కోసం మంగళవారం కలెక్టరేట్‌లో లక్కీ డ్రా నిర్వహించారు. సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరిధిలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2-బి బార్ కోసం మొత్తం 200 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను జిల్లా రెవెన్యూ అధికారి సంగీత సమక్షంలో డ్రా తీశారు. సరూర్‌నగర్ కర్మన్‌ఘాట్, లింగోజిగూడకు చెందిన గుర్రం సత్తిరెడ్డి (టోకెన్ నెంబర్ 97) ఎంపికయ్యారు. అతనికి 2-బి బార్ లైసెన్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ ఎక్సైజ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

- రాష్ట్ర హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి గౌతమ్


సర్వే తీరును పరిశీలిస్తున్న గౌతమ్

మహేశ్వరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లు అందజేయడానికి నిరుపేదలను మాత్రమే గుర్తించాలని, ఇందుకోసం సర్వేను పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర హౌసింగ్‌శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపీ గౌతమ్ అన్నారు. మంగళవారం మహేశ్వరం మండలంలోని సిరిగిరిపురం, తుక్కుగూడ మున్సిపాలిటీలోని 8, 10వ వార్డులు, మంఖాల్‌లో జరిగిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబాల స్థితిగతుల గురించి తెలుసుకున్నారు. ఇండ్ల కోసం ఎవరి పైరవీ అవసరం లేదని, అర్హులకు తప్పకుండా మంజూరు చేస్తారన్నారు. ఇండ్ల పంపిణీలో అధికారులు ఎవరైనా అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మహేశ్వరం తహసీల్దార్ సైదులు, తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి, ఎంపీడీవో శైలజ, చంప్లానాయక్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతాం

కడ్తాల్, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): పేదల శ్రేయస్సుకు ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటోందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. కడ్తాలలో మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీకి ఎమ్మెల్యే, కలెక్టర్ నారాయణరెడ్డి హాజరయ్యారు. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ ముంతాజ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వై.గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికారప్రతినిది శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి 57 మందికి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి పథకం ఎంతో తోడ్పాటు అందిస్తోందన్నారు. పోర్త్ సిటీ ఏర్పాటుతో కడ్తాల ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటై యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, చేగూరి వెంకటేశ్, బిచ్యానాయక్, బిక్య, చందోజీ, జహంగిర్, బిక్షపతి, వేణుగోపాల్, మల్లేశ్, సురేందర్‌రెడ్డి, జంగారెడ్డి, రామకృష్ణ, నరేందర్, శంకర్, అశోక్, షాబుద్దీన్, రవి, మల్లేశ్‌గౌడ్, కరుణాకర్, బాల్‌రాజ్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆమనగల్లు: ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన 32 మందికి రూ.5.1లక్షలు విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నారాయణరెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బి.కిషన్‌రెడ్డి, నూదిని కొండల్‌రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, రమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బాబ, టి.రామకృష్ణ, శ్రీను, సురేందర్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, విజయ్‌రాథోడ్, అనంతరెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ చైర్మన్ యాదిలాల్, సభ్యులు

జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు నూతన భవనాల నిర్మాణం

ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు స్థలాన్ని కేటాయించి భవనాల నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి అన్నారు. న్యాయవాదులకు, ప్రజలకు మెరుగైన వసతులతో భవనాల నిర్మాణం చేస్తామని చెప్పారు. ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు మంగళవారం అసోసియేషన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. బార్ చైర్మన్ అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ నూతన చైర్మన్‌గా ఎన్నికైన యాదిలాల్‌ను ఎమ్మెల్యే సైతం సత్కరించారు. ప్రస్తుతం కోర్టు నిర్వహిస్తున్న మండల పరిషత్ భవనాలు పాతవని, స్థలాన్ని కేటాయించి నూతన భవనాలను నిర్మించాలని, సబ్ కోర్టు ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని వినతిపత్రమిచ్చారు. అనువైన స్థలంలో భవనాల నిర్మాణానికి చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కొత్త భవనాలు నిర్మాణం వరకు ప్రస్తుత భవనాల్లో వసతులు కల్పిస్తామని చెప్పారు. న్యాయ వ్యవస్థలపై న్యాయవాదులు ప్రజలకు అవగాన కల్పించాలని కోరారు. పేదలకు ఉచితంగా న్యాయసేవలందించాలని సూచించారు. న్యాయవాదులు పేదలకు సేవలందిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లక్ష్మణశర్మ, ఎం.జగన్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు ఎ.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి కృష్ణ, లైబ్రేరియన్ వసుపుల మల్లేశ్, క్రీడా సాంస్కృతిక కార్యదర్శి శేఖర్, న్యాయవాదులు గణేశ్, సంతోష్, శేఖర్, దేవేందర్, శ్రీనివాస్, నరేందర్, శిరీష్, మహేశ్, శివ, ధర్మేందర్, పీసీబీ సభ్యుడు బాలాజీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కార్‌అండ్‌బైక్ రేస్ విజేతకు బహుమతి అందజేత

ఆమనగల్లు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి నిర్వహించిన కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రాలో బహుమతి గెల్చుకున్న పాఠకుడికి మంగళవారం ఆమనగల్లులో బహుమతి అందజేశారు. రంగారెడ్డి జిల్లాలో 8మంది పాఠకులు కన్సోలేషన్ బహుమతులు గెలిచారు. వారిలో ఆమనగల్లుకు చెందిన దూసకంటి ఆంజనేయులు ఉన్నారు. ఆయనకు ఆంధ్రజ్యోతి ఎస్ఆర్ వెంకటేశ్, ఆమనగల్లు ఆర్‌సీ ఇన్‌చార్జి రమణారెడ్డిలు బహుమతి అందజేశారు. పదేళ్లుగా తాను ఆంధ్రజ్యోతి దినపత్రిక పాఠకుడినని ఆంజనేయులు తెలిపారు.


ఆంజనేయులకు బహుమతి అందజేస్తున్న రమణారెడ్డి, వెంకటేశ్

ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో

మహా నగరంగా మహేశ్వరం

మహేశ్వరం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని మహానగరాలకు దీటుగా ఆవిర్భవించనున్న ఫ్యూచర్ సిటీతో మహేశ్వరం కూడా మహానగరంగా మారుతుందని మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కె.లక్ష్మారెడ్డి అన్నారు. ఫ్యూచర్‌సిటీ మ్యాప్‌ను మంగళవారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. దేశానికే ఐకానిక్ సిటీగా ఫ్యూచర్‌సిటీ రూపుదాల్చనుందన్నారు. 300ఫీట్ల రోడ్డు నిర్మిస్తామని, దేశవిదేశాల సంస్థలు ఇక్కడ నెలకొల్పుతారని చెప్పారు. మహేశ్వరం, కందుకూరు ప్రాంతాలు అత్యాధునికంగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఫ్యూచర్‌సిటీ రాకతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయని, కోకాపేటను తలదన్నేలా భూముల ధరలు ఆకాశాన్నంటుతాయన్నారు. ఫ్యూచర్‌సిటీలో స్కిల్ యూనివర్సిటీ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. త్వరలోనే మరిన్ని సంస్థలు నిర్మాణాలు ప్రారంభిస్తాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎవరేమన్నా హామీలన్నీ నెరవేరుస్తామన్నారు.


ఫ్యూచర్ సిటీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కేఎల్లార్

మే డేను విజయవంతం చేయాలి

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాడి సాధించుకున్న మే డే దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు పిలుపునిచ్చారు. సోమవారం మే డే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాజు మాట్లాడుతూ.. కార్మిక హక్కులు, డిమాండ్ల సాధనకు సంఘాలకతీతంగా కార్మికులంతా మే డేలో పాల్గొనాలని కోరారు. శ్రీనునాయక్, యాదయ్య, రాజు, జంగయ్య, అంజమ్మ, శంకరయ్య, కుమార్ పాల్గొన్నారు. అలాగే మే డేలో విజయవంతం చేయాలని కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు పినపాక ప్రభాకర్‌రావు పిలుపునిచ్చారు.



పంచాయతీ కార్యదర్శిని సత్కరిస్తున్న మంత్రి సీతక్క, లోకేశ్‌కుమార్

అధికారులను సత్కరించిన మంత్రి

యాచారం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనులుచేస్తే సత్కారాలు, అభినందనలు వస్తాయని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని మాల్ పంచాయతీ రాష్ట్రంలోనే ఉత్తమ పంచాయతీగా ఎంపికై ప్రధానమంత్రి నుంచి ఆత్మ నిర్భర్ అవార్డు అందుకుంది. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి వైవీ.రాజు, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలతలను మంత్రి సోమవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో సత్కరించారు. 'మాల్ పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.కోటి వచ్చేందుకు కారకులైన మీ కృషి అభినందనీయం.' అని మంత్రి వారితో అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేశ్‌కుమార్, డీపీవో సురేష్‌మోహన్, డీఎల్‌పీవో సాధన పాల్గొన్నారు.

పహల్గాంలో ఉగ్రదాడి బాధాకరం

కొడంగల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి బాధాకరమని సీపీఐ నియోజకవర్గ నాయకుడు సురేశ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, అంబేడ్కర్ సంఘాల నియోజకవర్గ అధ్యక్షుడు రమేశ్‌బాబు అన్నారు. మంగళవారం రాత్రి కొడంగల్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. వారు మాట్లాడుతూ .. ఉగ్రదాడులతో చాలా దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే ఏ దేశం కూడా మనుగడ సాధించలేదన్నారు. అమాయకులను చంపడం హేయమైన చర్య అన్నారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి.సాయిలు, షాకీర్, అశ్వాక్, మాసాని వెంకటయ్య, హకీం, బాబ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తాండూరు రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని గోనూరు కొనుగోలు కేంద్రానికి తెచ్చి విక్రయించుకోవాలని డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం గోనూరులో డీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ సలాం పాషా ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నర్సిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జర్నె నాగప్ప, డైరెక్టర్లు ఉదయభాస్కర్‌రెడ్డి, కరీం, డీసీఎంఎస్ ఇన్‌చార్జి సలీం పాషా, నాయకుడు వడ్డె శ్రీనివాస్, రైతులు హరినాథ్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, డీలర్ మల్లేశ్, సతీష్, వెంకటరాజ్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ సభ సక్సెస్‌ను ఓర్వడంలేదు'

తాండూరురూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు లక్షల్లో తరలొచ్చిన జనాన్ని చూసి కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోవడం లేదని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్ అన్నారు. మంగళవారం తాండూరులోని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవంపై మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. కేసీఆర్ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. కాంగ్రెస్, బీజేపీని నమ్మేస్థితిలో ప్రజలు లేరని, మళ్లీ పాలనలోకి వచ్చేది బీఆర్‌ఎస్సే అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాల అధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, కోహీర్ శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సలీం పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై శ్రద్ధపెట్టాలి

యాచారం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నర్సరీల్లో మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మేడిపల్లిలో హరితహారం నర్సరీని తనిఖీ చేశారు. నర్సరీల్లో విష సర్పాలుంటాయని.. జాగ్రత్తలు పాటిస్తూ మొక్కలకు నీరు పెట్టాలన్నారు. వానాకాలంలో మండలంలో లక్షకుపైగా మొక్కలు పెంచాలని కార్యదర్శికి సూచించారు. ఆయనతో ఏపీవో లింగయ్య ఉన్నారు.



వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మె శ్రీలతాసత్యనారాయణ

ఉత్సవాలకు ఉచిత నీటి సరఫరా

కొత్తూర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఎస్‌బీపల్లిలో ఈ నెల 30వ తేదీ నుంచి మే 8 వరకు జరిగే బీరప్ప స్వామి ఉత్సవాలకు ఉచితంగా మంచినీటి సరఫరా చేసేందుకు కొత్తూర్ మాజీ జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యనారాయణ ముందుకొచ్చి తన ఉదారతను చాటుకున్నారు. 10రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా వేసవిని దృష్టిలో పెట్టుకొని భక్తులకు మంచినీటిని సరఫరా చేసేందుకు మాజీ జడ్పీటీసీ నిర్ణయించారు. వాటర్ ట్యాంకర్‌ను సోమవారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కురమ సంఘం అధ్యక్షుడు ఎమ్మె అజయ్, నాయకులు పాండు, కడాల శ్రీశైలం, కృష్ణయ్య, అంజనేయులు, రాఘవేందర్, అంబటి నర్సింహ, ఎమ్మె నర్సింహ, మహేందర్‌రెడ్డి, కుమార్, పాండు, రమేష్, కుమార్, కుమార్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వుషూ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొత్తూర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వుషూ పోటీల్లో కొత్తూర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సిరిసిల్ల జిల్లాలో మూడు రోజులు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల జూనియర్ క్యాటగిరీలో మహ్మద్ ముకిమ్ గోల్డ్ మెడల్, వీరమోని నిఖిల్ సిల్వర్, మహ్మద్ గఫ్ఫార్ సిల్వర్, డి.శ్రేయణ్ బ్రోంజ్ మెడల్ సాధించారని ఈగల్ కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్ హాజీ మంగళవారం తెలిపారు. మెడళ్లు గెల్చిన విద్యార్థులను రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, కార్యదర్శి అబ్దుల్ ఒమర్, జాయింట్ సెక్రటరీ వేముల సతీష్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రవితేజ, కార్యదర్శి అఖిల, జావిద్‌ఖాన్, రాజుయాదవ్ అభినందించారని తెలిపారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న జిమ్స్ వైద్యులు

వైద్య శిబిరం విజయవంతం

కేశంపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిమ్స్ ఆసుపత్రి, మైత్రీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం విజయవంతమైంది. వేముల్‌నర్వలోని మదర్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆవరణలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జిమ్స్ వైద్యులు రఘునందన్ బృందం 128మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందుల అందించారు. 12 మంది వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్నారని గుర్తించి వారికి చికిత్స కోసం పాల్మాకులలోని జిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో వైద్యులు మృదుల, సల్మాన్, నాయుడు, సురేష్‌గౌడ్, కార్యదర్శి ప్రసన్నలక్ష్మి, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బెదిరింపు.. ఫిర్యాదు

» ఇన్‌చార్జి మంత్రి, పోలీసులకు నవాబ్‌పేట కాంగ్రెస్ నాయకుల కంప్లైంట్



ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నవాబ్‌పేట మండల కాంగ్రెస్ నాయకులు

నవాబ్‌పేట్/వికారాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : దుర్భాలాడుతూ.. అంతు చూస్తానంటూ బెదిరింపులకు గురిచేసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యపై చర్యలు తీసుకోవాలని నవాబ్‌పేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, ఆర్కతల తలారి శేఖర్, నవాబ్‌పేట మీనపల్లి శివప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 28న నవాబ్‌పేట మండలంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో పాల్గొన్న సమయంలో 'మాకు ఎమ్మెల్యే ఫోన్ చేసి.. మీ పదవులు పోతాయి, గ్రూపుల్లో ఏమేమో పోస్టులు పెడుతున్నారంటూ దుర్భాషలాడుతూ మీ అంతు చూస్తానంటూ బెదిరించారు. ఆయన వల్ల మాకు ప్రాణహాని ఉంది' అంటూ వారు తమ ఫిర్యాదులో పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. కాగా, దుర్భాషలాడి, బెదిరించడం ఎంత వరకు సమంజమని అడిగితే తనను కూడా అంతు చూస్తానంటూ బెదిరించారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, చేవెళ్ల ఎమ్మెల్యేపైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు వచ్చాయని, విచారణ చేపడుతున్నామని నవాబ్‌పేట్ ఎస్‌ఐ అరుణ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'తో స్పష్టం చేశారు.

ఇన్‌చార్జి మంత్రి దృష్టికి పంచాయితీ

అనంతరం వారు ఈ విషయంపై ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఫిర్యాదు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసానికి వెళ్లి ఆయనకు ఫిర్యాదు అందజేశారు. తన దృష్టికి వచ్చిన ఫిర్యాదుపై స్పందించిన మంత్రి ఈ విషయమై చేవెళ్ల ఎమ్మెల్యేతో మాట్లాడతానని హామీ ఇచ్చినట్లు తెలిసింది. కాగా, ఈ విషయాన్ని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ మహేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డిలకు కూడా వారు ఫిర్యాదు చేశారు. వారి వెంట కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, ఆనందం, సంగమేష్, సదానంద్, లక్ష్మణ్, నందు, రాములు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుడిని ఎమ్మెల్యే తిట్టిన మాటలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి.

ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే..

» రోడ్డు విస్తరణ పనులకు బ్రేక్



ఎన్జీటీ కోర్టు కాపీని చూపుతున్న పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-బీజాపూర్ రోడ్డు విస్తరణ పనుల నిర్వహణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. మంగళవారం చేవెళ్లలోని పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులను పూర్తిచేయాలనే ఆలోచన కాంగ్రెస్, బీజేపీ పాలకులకు లేదన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే రోడ్డు పనులు ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ హైవే అధికారులు, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు రోడ్డు పనులు జరుగుతున్నాయని అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఎన్‌జీటీ కోర్టుకు అధికారులు తప్పుడు నివేదిక పంపడంతో రోడ్డు విస్తరణ పనులు నిలిపివేయాలని ట్రిబ్యునల్ కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించిందని తెలిపారు. అవసరమైతే రోడ్డు అలైన్మెంట్ మార్చాలని సూచించిందని చెప్పారు. అసెంబ్లీలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి హైదరాబాద్-బీజాపూర్ రోడ్డు విస్తరణపై అడిగిన ప్రశ్నకు రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బీజాపూర్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని, కోర్టుతీర్పు అయిపోయిందని అబద్ధం చెప్పారని గుర్తుచేశారు. హైవే విస్తరణ పనులు పూర్తిచేసే బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డి తీసుకోవాలని కోరారు. రోడ్డు పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా ఉన్నాయన్నారు. ఎంతో రద్దీగా ఉండే కీలకమైన ఈ రోడ్డు విస్తరణకు నోచుకోక నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఇప్పటికే చాలా మంది ప్రాణాలు కోల్పోయారని, అయినా ప్రభుత్వానికి పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్, నాయకులు మాధవగౌడ్, తులసిరాజు, ఎల్లయ్య, విగ్నేష్‌గౌడ్, వై.కృష్ణ, వెంకటేశ్, చంద్రశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, సీహెచ్.వెంకటేశ్, శేరి రాజు, రాంప్రసాద్, అబ్దుల్ ఘనీ, వెంకటేశ్, మాణిక్యరెడ్డి, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

సీఎం, మంత్రులను కలిసిన నాయకులు

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్‌లో వ్యవసాయ కళాశాల ఏర్పాటు కోసం బొంరాస్‌పేట్ మండల కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్కలను కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో సీఎం, మంత్రులను వారు కలిసి బొంరాస్‌పేట్‌లో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, ప్యాక్స్ చైర్మన్ జయకృష్ణ, రాంచంద్రారెడ్డి, దేశ్యానాయక్, నర్సిములునాయుడు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

కొత్తూర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రానున్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఇన్ముల్‌నర్వలో బీజేపీ మండల అధ్యక్షుడు అత్తాపురం మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి రాజ్‌భూపాల్‌గౌడ్, రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలు హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రతి ఇంటికి తెలియజేయాలన్నారు. హామీలను నేరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్, బావండ్ల మాణిక్యం, అశోక్‌గౌడ్, మంగలి రమేష్ కుమార్ పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం



భూ భారతి సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

దోమ/చౌడాపూర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి నూతన చట్టం ద్వారా భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మంగళవారం దోమలోని రైతు వేదికలో భూ భారతిపై రైతులకు అవగాహన కల్పించారు. పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జూన్ 2నుంచి రాష్ట్రంలో నూతన చట్టం అమల్లోకి వస్తుందన్నారు. కాస్తు కాలం నమోదు, సాదాబైనామాలు, 13బీ, భూ సమస్యలపై అప్పీలు చేసుకునేందుకు రెండంచెల విధానం, సర్వే మ్యాప్ అనంతరం రిజిస్ట్రేషన్, విరాసత్, మ్యుటేషన్ వాటిపై గ్రామ స్థాయిలో స్థాయిలో విచారణ చేసి కావాల్సినమార్పులు, చేర్పులను చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో గమ్యా, ఏవో ప్రభాకర్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, వెంకటయ్య, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు. చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో భూ భారతి చట్టంపై అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ రైతులకు అవగాహన కల్పించారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా భూ సమస్యలు పరిష్కరించేలా కొత్త చట్టం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, వైస్‌చైర్మన్ రామ్మోహన్‌శర్మ, నాగరాజు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరం

కులకచర్ల: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరం వంటివని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. కులకచర్ల రైతు వేదికలో 40మందికి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఒసైటీ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, తహసీల్దార్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో అతలాకుతలం

» చౌదర్‌పల్లి, కొత్లాపూర్‌లలో పిడుగులు

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):జిల్లా వ్యాప్తంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రతతో జనాలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మంగళవారం సాయంత్రం పలుచోట్ల ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ అకాల వర్షంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. బొంరాస్‌పేట్ మండల కేంద్రంతో పాటు మదన్‌పల్లి, బురాన్‌పూర్, దుప్చర్ల, మహంతీపూర్ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లిన రైతులు అకాల వర్షాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చౌదర్‌పల్లి గ్రామంలో పిడుగుపాటుకు రైతు కనిగేరి నర్సిములుకు చెందిన గేదె మృతి చెందింది.



రాలిన మామిడిని చూసి బోరుమంటున్న రైతులు బాసిద్

కొత్లాపూర్‌లో ఈత చెట్టుపై పడిన పిడుగు

తాండూరురూరల్: తాండూరు మండల పరిధిలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులు వీచాయి. ఆ సమయంలో కొత్లాపూర్ గ్రామంలో ఈత చెట్టుపై పిడుగు పడి నిప్పంటుకుంది. ఆ సమీపంలోని వెంకటప్ప అనే మేకల కాపరి చేతికి స్వల్ప గాయాలయ్యాయి.

పూడూరులో రాలిన మామిడి

పూడూరు: పూడూరు మండలంలో సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో మామిడి తోటలో కాయలన్నీ నేలరాలిపోయాయి. పలు మామిడి చెట్లు వేళ్లతో సహా విరిగిపోయాయి.



నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో కురుస్తున్న వర్షం

యంనంపేట్, రాంపల్లిలో భారీ వర్షం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్, పోచారం, నాగారం మున్సిపాలిటీల పరిధిలో మంగళవారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్, నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో భారీ వర్షం కురిసింది.



మల్కాపూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

చేవెళ్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం చేవెళ్ల మండలం మల్కాపూర్‌లో రూ.10లక్షలతో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దశలవారీగా నిధులు కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల, ముడిమ్యాల్ సొసైటీల చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్‌చైర్మన్ బి.రాములు, చేవెళ్ల మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి, బల్వంతరెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్, ఎన్.గోపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మల్లారెడ్డి, మోసిన్, నరేందర్‌గౌడ్, శివరాజ్, జంగయ్య, నయీమ్, రాజు, రమేశ్, రాజశేఖర్, దర్శన్, శివ, మధుసూదన్‌గుప్తా, యాదిరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కులకచర్ల మండల కమిటీ సభ్యులతో కరణం ప్రహ్లాద్‌రావు

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

కులకచర్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ పూర్తి స్థాయి మండల కమిటీలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. పార్టీ మండల కమిటీ ఇన్‌చార్జిలుగా హనుమంతు, నరేశ్, వెంకటేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, రాజు, వెంకట్‌రెడ్డి, రాంచంద్రయ్య, కార్యదర్శులుగా రామకృష్ణ, మల్లేశం, నర్సింహులు, విజయలక్ష్మి, ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అంజిలయ్య, మహిపాల్, భీమయ్య, కర్ణ, చంద్రలింగం, మల్లేశ్ పాల్గొన్నారు.

గ్రీన్ చాలెంజ్‌లో భాగస్వాములు కావాలి



కీసరలో మొక్క నాటుతున్న మాధురి

కీసర, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): గ్రీన్ చాలెంజ్‌లో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని హరితసేన రాష్ట్ర అధ్యక్షురాలు నాయకపు మాధురి అన్నారు. ఈ మేరకు మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పిలుపు మేరకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో హరితసేన ద్వారా మొక్కలు నాటుతున్నామన్నారు. ఇందులో భాగంగా తన పుట్టిన రోజును పురస్కరించుకొని మంగళవారం కీసర సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద మహిళలతో కలిసి మొక్కలు నాటినట్టు చెప్పారు.

ప్రహరీ కూల్చివేత.. పోలీసుల రంగప్రవేశం



తాండూరు సెయింట్ మార్క్స్ హైస్కూల్ వద్ద గుమిగూడిన స్థానికులు

తాండూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తాండూరులోని సెయింట్ మార్క్స్ హైస్కూల్ సమీపంలోని సర్వే నంబర్ 128లోని 26 గుంటల స్థలం వివాదాస్పదంగా మారింది. గతంలో ఈ స్థలానికి సంబంధించి బిచ్చాల చిన్న రాములు తన 11 ఎకరాల్లో 26 గుంటలు మినహాయించి మిగతా భూమిని సెయింట్ మార్క్స్ హైస్కూల్‌కు విక్రయించాడు. 2022లో 26 గుంటల స్థలాన్ని పటేల్ ప్రవీణ్‌కుమార్‌కు అమ్మారు. అప్పట్లోనే ఆయన ప్రహరీ నిర్మించుకున్నాడు. ఆ ప్రహరీని సెయింట్ మార్క్స్ హైస్కూల్‌కు చెందిన వ్యక్తులు కూల్చి వేయడంతో ప్రిన్సిపాల్ ఆరోగ్యరెడ్డిపై పటేల్ ప్రవీణ్ ఫిర్యాదు చేశాడు. ఈ వివాదం కోర్టులో కొనసాగుతుండగానే సెయింట్ మార్క్స్ హైస్కూల్‌కు చెందిన వ్యక్తులు ప్రహరీని మంగళవారం కూల్చి వేశారు. దీంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. సెయింట్ మార్క్స్ హైస్కూల్ ప్రతినిధులు ఫిర్యాదు చేయడంలో పోలీసులు అక్కడికి చేరుకొని వివాదాన్ని గొడవను నిలువరించారు.

క్రైం కార్నర్

రెండు బైక్‌లు ఢీ.. ఒకరికి గాయాలు

చౌదరిగూడ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఒకదానికొకటి ఢీకొనడంతో వ్యక్తికి గాయాలైన ఘటన మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్‌లో చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. షాద్‌నగర్‌కు చెందిన వేముల కార్తీక్(25) బైక్‌పై అమ్మమ్మ ఊరు జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఇంద్రనగర్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. లాల్‌పహాడ్ శివారులోని కేజీబీవీ మూలమలుపు వద్ద చౌదరిగూడ నుంచి ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో కార్తీక్ తలకు రక్తగాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. బైక్‌ను అతివేగం, అజాగ్రత్తగా బైక్ నడిపి కార్తీక్‌ను ఢీకొన్న వ్యక్తి వివరాలు తెలుసుకుని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అతడి తమ్ముడు వంశీకృష్ణ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం... కేసు నమోదు


బసంత్ బెహరా(ఫైల్)

కేశంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటేశ్వర హేచరీస్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న బసంత్ బెహరా అనే వ్యక్తి అదృశ్యం అయినట్లు కేశంపేట సీఐ నరహరి తెలిపారు. ఒడిషాకు చెందిన బసంత్ బెహరా(47) మండలంలోని కొత్తపేట సమీపంలో ఉన్న వెంకటేశ్వర హేచరీస్‌లో ఏడాది నుంచి వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 28న షాద్‌నగర్ ఆసుపత్రికి వెళ్తానని చెప్పి హేచరీస్ నుంచి వెళ్ళాడు. ఆ సమయంలో వైట్ కలర్ టీషర్ట్, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించి కోల ముఖంతో ఉంటాడని తెలిపారు. ఆయన బంధువు పీటిష్ బెహరా మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

'కేసీఆర్‌ను విమర్శించే హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదు'

చౌదరిగూడ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కేసీఆర్‌ను విమర్శించే హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్ఎస్ జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ అన్నారు. మంగళవారం మండలంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వరంగల్‌లో నిర్వహించిన రజతోత్సవ సభకు వచ్చిన జనాన్ని చూసి ఓర్వలేక మంత్రుల నుంచి నాయకుల వరకు భయం పుట్టి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఎక్కడ పూర్తి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను విమర్శించే స్థాయి మీది కాదు ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. నాయకులు బంగారు రాములు, బాబురావు, జబ్బార్, ఇస్మాయిల్, గణేష్, మాణెయ్య, సత్యప్రమోద్, నర్సింహులు, తదితరులున్నారు.

వడివడిగా అడుగులు!

(5వ పేజీ తరువాయి)



జిల్లా కలెక్టర్ శశాంకను నియమించింది. ఈ ప్రాంతంపై ఆయనకు పట్టు ఉండడంతో ఇప్పటికే ఫ్యూచర్ సిటీ ప్రణాళికలో ఆయన భాగస్వాములుగా ఉండడంతో కమిషనర్‌గా ఆయన్ని ప్రభుత్వం నియమించింది. కమిషనర్ నియామకంతో ఫ్యూచర్ సిటీ పనులు ఇక వేగవంతం కానున్నాయి. ప్రస్తుతానికి ఫ్యూచర్ సిటీ కమిషనర్ కార్యాలయం నానక్‌రామ్‌గూడలో కొనసాగనుంది. తరువాత కాలంలో దీన్ని ఫ్యూచర్ సిటీకి మార్చనున్నారు. అలాగే ఫ్యూచర్ సిటీ అథారిటీలో సిబ్బంది నియామకాలను కూడా త్వరలో చేపట్టనుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన పోస్టులను ప్రభుత్వం ప్రకటించింది. ఫ్యూచర్ సిటీలో మొత్తం 14 జోన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ సిటీలో మల్టీమోడల్ కనెక్టివిటీ, ఎలక్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు, గ్రీన్ బిల్డింగ్‌ల వంటి ఆధునిక సౌకర్యాలు ఉంటాయి. ఏఐసిటీ, ఫార్మాహబ్, స్పోర్ట్స్‌సిటీ, క్లీన్ ఎనర్జీ ఇన్నోవేషన్ తదితర జోన్లు ఏర్పాటు చేస్తారు. ఫ్యూచర్ సిటీకి అన్ని హంగులు ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం ఇప్పటికే పలు ప్రాంతాలను అనుసంధానం చేసే విధంగా రహదారుల నిర్మాణాలు కూడా చేపడుతోంది. బెంగళూరు హైవే, సాగర్ హైవే మధ్య మరో రెండు రహదారుల నిర్మాణాలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఫ్యూచర్ సిటీ పరిధిలో ప్రత్యేక పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ ప్రాంతంలో పలు జాతీయ, అంతర్జాతీయ ప్రముఖ సంస్థలు భారీగా పెట్టుబడులు పెడుతున్నందున శాంతి భద్రతలపై కూడా ముందు నుంచే దృష్టిపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఫ్యూచర్ సిటీ మరింత విస్తరణ!

ఇదిలా ఉంటే ఉత్తరాన రీజినల్ రింగురోడ్డు, దక్షిణాన ఔటర్ రింగురోడ్డు మధ్య ఉన్న మరికొన్ని గ్రామాలను కలిపి ఫ్యూచర్ సిటీని మరింత విస్తరించే యోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే ప్రకటించిన 56గ్రామాల చుట్టుపక్కల ప్రాంతాల వారు కూడా తమ ప్రాంతాలను కూడా ఫ్యూచర్ సిటీలో కలపాలని కోరుతున్నారు. మహేశ్వరం, కందుకూరు, యాచారం మండలాల్లోని కొన్ని గ్రామాల వారు ఆందోళన కూడా చేస్తున్నారు. దీంతో ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా కొన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీ పరిధిలోకి తీసుకువచ్చే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇదిలా ఉంటే పారిశ్రామిక అవసరాల కోసం ఫ్యూచర్ సిటీ పరిధిలో దాదాపు మరో 2వేల ఎకరాలకు పైగా భూసేకరణ చేపట్టాలని సన్నాహాలు చేస్తోంది. కొత్తగా భూములు సేకరించే ప్రాంతాల్లో ప్రభుత్వం పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేయనుంది. ఇటీవల కందుకూరు మండలంలో 643 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. తిమ్మాయిపల్లిలో 366.04 ఎకరాలు, కొంగరకుర్దులో 277 ఎకరాల భూసేకరణకు కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు. అలాగే యాచారం మండలం తాడిపర్తి, మొండిగౌరెల్లిలో 821.11 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దాదాపు ఇందులో అసైన్డ్ భూములే ఉన్నాయి. అలాగే త్వరలో కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో 600 ఎకరాలు, పంజాగూడ గ్రామంలో 300 ఎకరాల భూసేకరణకు అధికారులు త్వరలో నోటిఫికేషన్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు.

భూసేకరణలో ఆటంకాలు తొలగించుకుంటూ..

ఇదిలా ఉంటే ఇప్పటికే ప్రభుత్వం రావిర్యాలలోని ఔటర్ రింగురోడ్డు ఎగ్జిట్ 13 నుంచి ఆమనగల్ ఫ్యూచర్ సిటీలోని స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ మీదుగా రీజినల్ రింగురోడ్డు వరకు 330 అడుగుల వెడల్పుతో ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం కోసం భూసేకరణ మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. మొత్తం 41.5కిలోమీటర్ల పొడవైన గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి సంబంధించి రెండు విడతలుగా నోటిఫికేషన్ జారీ చేసింది. తొలివిడత 20కి.మీ. కోసం 449 ఎకరాల 27 సెంట్ల భూమి సేకరణ కోసం నోటిఫికేషన్ జారీ, హద్దులు కూడా నిర్ణయించింది. తొలివిడత రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.2000కోట్ల నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల రెండో విడత 21.5 కి.మీ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం కోసం 554.35 ఎకరాలు సేకరించేందుకు నోటిఫికేషన్ జారీచేసి హద్దురాళ్ల వేశారు. అయితే భూసేకరణ ప్రక్రియపై అభ్యంతరాలు రావడంతో దీనిపై న్యాయస్థానం స్టే విధించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పనులకు ఆటంకం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇందుకోసం ఒక అడుగు వెనక్కి తగ్గి అందరికీ ఆమోదయోగ్యమైన విధంగా పరిహారం ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో రైతులతో చర్చలు జరిపేందుకు మాజీ ఎమ్మెల్యే కేఎల్లాఆర్‌ను ఇప్పటికే రంగంలో దింపింది. పలు గ్రామాల్లో రైతులతో ఆయన ఇప్పటికే చర్చలు జరిపి భూములు కోల్పోతున్న రైతులందరికీ తగిన న్యాయం చేస్తామని నచ్చచెప్పారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని, దీని వల్ల ఉన్న భూములకు డిమాండ్ ఉంటుందని ఆయన రైతులకు వివరిస్తున్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి : వీర్లపల్లి

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ధాన్యం మద్దతు ధర కోసం అన్నదాతలు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం కొందుర్గు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం గ్రేడ్-వన్ రకం క్వింటాలుకు రూ.2,320, కామన్ రకాలకు రూ.2,300 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. దళారుల బారిన పడకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుని ధాన్యానికి గిట్టుబాటు ధరను పొందాలని తెలిపారు. ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్, సింగిల్‌విండో చైర్మన్లు దామోదర్ రెడ్డి, బక్కన్నయాదవ్, సీతఃవేలు మహబూబ్ షరీఫ్, రఘునందన్, జి.బాల్‌రాజ్‌గౌడ్, కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కరుణాకర్, పురుషోత్తంరెడ్డి, కొమ్ము కృష్ణ, బస్వం, హరినాథ్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్ తదితరులున్నారు.

స్థానికేతరుల నాయకత్వంతోనే బీజేపీకి నష్టం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌రాజ్

షాద్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానికేతరుల నాయకత్వం వల్లనే షాద్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీ పూర్తిగా వెనుకబడిపోయిందని బీజేపీ సీనియర్ నేత, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేమ్‌రాజ్ అన్నారు. సంఘటన.. సంరచనా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన షాద్‌నగర్‌లో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని ఒక్క షాద్‌నగర్ నియోజకవర్గంలోనే బీజేపీ పూర్తిగా వెనుకబడి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికేతరులకు పార్టీ బాధ్యతలు అప్పగించడం వల్ల వారు తమ వ్యక్తిగత విషయాలకే ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలోనే పార్టీ ప్రక్షాళన చేయడం కూడా జరిగిందన్నారు. పార్టీ వేరు.. వ్యక్తిగతం వేరన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి కోసం ఎన్నికలు నిర్వహించామన్నారు. ఈ ఎన్నికల్లో అన్నికులాల వారికీ ప్రాధాన్యం కల్పించామని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని చెప్పారు. షాద్‌నగర్ బీజేపీ ఇన్‌చార్జి బాబయ్య, దేపల్లి అశోక్ గౌడ్, వెంకటేష్ గుప్తా, ప్రశాంత్, కుర్మయ్య, ఎంకనోళ్ల వెంకటేష్, రిషికేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చడానికి బీజేపీ కుట్ర


దెబ్బడగూడలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కృష్ణానాయక్, ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, శ్రావణి

కందుకూరు, ఏప్రిల్ 29(ఆంధ్ర జ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్రలు పన్నిందని, రాజ్యాంగాన్ని కాపాడడానికి ప్రతీ ఒక్కరు కలిసి రావాలని పీసీసీ ప్రచార కమిటీ తత సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డిలు అన్నారు. మంగళవారం మండలంలోని దెబ్బడగూడ, సార్లరావులపల్లి, మీర్కాన్‌పేటలో నిర్వహించిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగాన్ని బీజేపీ నేతలు, కేంద్ర మంత్రులు ఎందుకు అవహేళన చేస్తున్నారోనని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం ఇన్నాళ్లు ప్రజలకు చేసిదేమిటని ప్రశ్నించారు. గ్రామాల్లో ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. యూత్ కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ గౌడ్, డైరెక్టర్లు సురేందర్, యుగేందర్‌గౌడ్, దెబ్బడగూడ మాజీ సర్పంచ్ శ్రావణి, అందుగుల సత్యనారాయణ, ఎండీ అఫ్జల్‌బేగ్, బుక్క పాండురంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంతోనే సబ్బండ వర్గాలకు న్యాయం



ఆదిభట్ల : మాట్లాడుతున్న అభిషేక్‌రెడ్డి

ఆదిభట్ల : రాజ్యాంగంతోనే సబ్బండ వర్గాలకు రాజకీయ న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి అన్నారు. కొంగరకలాన్‌లో జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులను కాపాడుకోవడానికి ప్రజలంతా ఏకం కావలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తుందన్నారు. లక్ష్మీపతిగౌడ్, శేఖర్‌గౌడ్, మహిపాల్, శివకుమార్, యాదగిరి, శంకర్‌గౌడ్, పొట్టి ఐలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కాంగ్రెస్‌ను విలన్ అనడం సరికాదు


మాట్లాడుతున్న రాణా ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్

కందుకూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి , తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీని తెలంగాణలో విలన్ అనడం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు తగదని, బేషరతుగా చేసిన ఆరోపణను వెంటనే వెనక్కు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాణాప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకుడు డిల్లీ శ్రీధర్‌లు డిమాండ్ చేశారు. ఆ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రజతోత్సవ సభలో కేసీఆర్ చేసిన ప్రసంగంలో ఎలాంటి పస లేదని, వారి పదేళ్ల పరిపాలనలో చేసిందేమీలేక.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై విమర్శించకుండా, కాంగ్రెస్ పార్టీ విలన్ అనడం సిగ్గుచేటన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు ఉద్యమంలో 1200 మంది యువకులు బలిదానమైతే ఏనాడైనా ఉద్యమకారులను కేసీఆర్ గుర్తించాడా అని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో నాయకులు మంచాల భాస్కర్, ఎండీ రహీం, గుల్లి దేవేందర్, కాషంశెట్టి కిషన్, గుల్లి రమేష్, మంచాల లక్ష్మయ్య, జి.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కడ్తాల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ కల్వకుర్తి నియోజకవర్గ చైర్మన్ పోతుగంటి శంకర్ పిలుపునిచ్చారు. ప్రజావిశ్వాసం కోల్పోయి అదికారానికి దూరమైన బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని ఆయన ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం ఎస్సీ సెల్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన శంకర్‌కు అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు పోతుగంటి అశోక్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. నాయిని నరేందర్, బాలకృష్ణ, గోపాల్‌రెడ్డి, తదితరులున్నారు.

మే డేను విజయవంతం చేయండి

నందిగామ/షాద్‌నగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కార్మికులు రోజుకు 8 గంటల పని సాధించుకున్న రోజు మే ఒకటి అని, ఈ సందర్భంగా నిర్వహించే మే డేను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ అనుబంధ, కార్మిక సంఘాలకు ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు పానుగంటి పర్వతాలు ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ప్రయోజనాలు కల్పించే స్కీంలను నిర్వీర్యం చేస్తున్నారని పేర్కొన్నారు. 44 రకాల కార్మిక చట్టాలను నేడు కేవలం నాలుగు రకాల లేబర్ కోడ్‌లతో రద్దు చేయాలనుకోవడం కార్మిక ద్రోహం కాదా అని ప్రశ్నించారు. మే డేను విజయవంతం చేయాలని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ ప్రకటనలో కోరారు. కార్మిక చట్టాలను మార్పు చేస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని, 4 లేబర్ కోడ్‌లను రద్దు చేసేంతవరకు పోరాటం చేయాలని పేర్కొన్నారు.

నేడు మహేశ్వరానికి ఈటల, కొండా రాక

మహేశ్వరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను మండలంలోని నాగారంలో కుండె వెంకటేష్ ఫాంహౌస్‌లో నేడు(బుధవారం) నిర్వహిస్తున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు తెల్లమల్ల యాదీష్ ప్రకటనలో తెలిపారు. ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, పార్టీ జిల్లా అ ధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, సీనియర్ నాయకులు హాజరవుతున్నార ని, మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

'భూ భారతి'పై అవగాహన అవసరం

(5వ పేజీ తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణిలో ఎన్నో అక్రమాలు చోటు చేసుకున్నాయని, తద్వారా రైతుల భూములకు భద్రత లేకుండా పోయిందన్నారు. సదస్సులో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీ సింగ్, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ ముంతాజ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, ఆనంద్, గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, చేగూరి వెంకటేశ్, సుజాత పాల్గొన్నారు.

భూ భారతి చట్టంతో రైతులకు మేలు

తలకొండపల్లి : మండల కేంద్రంలోని దేవకి గార్డెన్‌లో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ నాగార్జున అధ్యక్షతన జరిగిన సదస్సుకు కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. 65మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డి, మిట్టపల్లి అంజయ్య, అజీం, డోకూరు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

న్యాయమైన పరిహారమందించాలి

కడ్తాల్ : 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటు మూలంగా సాగు చేసుకుంటున్న భూములు కోల్పోతున్న తమకు ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందించి ఆదుకోవాలని కడ్తాల గ్రామ రైతులు కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. ఈమేరకు కలెక్టర్‌కు డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డిలతో కలిసి రైతులు వినతిపత్రం అందజేశారు. గజానికి రూ.5వేల చొప్పున చెల్లించాలని కోరారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి న్యాయమైన పరిహారం అందించేలా చూడాలని కోరగా.. ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అలాగే భూభారతి నూతన ఆర్‌వోఆర్-2025 చట్టంలో సమస్యల పరిష్కారానికి నిర్ణీత కాల వ్యవధిని పొందపరుచాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి కలెక్టర్‌ను కోరారు.

కలెక్టర్ నారాయణరెడ్డికి సన్మానం

కలెక్టర్ నారాయణరెడ్డికి మండల కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయన బాధ్యతలు చేపట్టి తొలిసారిగా రావడంతో పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి సహకరించాలని నాయకులు కోరారు. నిషేధిత జాబితాలో ఉన్న పట్టాభూములను తొలగించాలని వినతిపత్రాలు అందజేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గీత, వైస్‌చైర్మన్ భాస్కర్ రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బీచ్యనాయక్, తదితరులున్నారు.

దర్జాగా కబ్జా!

(5వ పేజీ తరువాయి)



చౌలపల్లిలో కబ్జాకు గురైన గ్రామకంఠం భూమిలో పాతిన బోర్డు

అర ఎకరం వరకు గ్రామకంఠం భూమి ఉండగా విక్రయించేందుకు కొందరు ప్రజాప్రతినిధులు పన్నాగం పన్నారు. అందుకోసం భూమిచుట్టూ ప్రీకాస్ట్ వాల్ నిర్మించారు. దాని విలువ సుమారు రూ.2కోట్ల వరకు ఉంటుంది. గ్రామస్థులు ఈ విషయాన్ని మాజీ ఎంపీపీ ఖాజాఇద్రిస్ దృష్టికి తీసుకువచ్చారు. అందుకు ఆయన ఆర్డీవోతో మాట్లాడి డిప్యూటీ సర్వేయర్‌తో సర్వే చేయించి కబ్జానుంచి విడిపించారు. అనంతరం అక్కడ గ్రామపంచాయతీకి చెందిన స్థలమని బోర్డు పాతారు. గతంలో గ్రామ పంచాయతీకి బంజరు దొడ్లు ఉండేవి. చాలా గ్రామాల్లో బంజరు దొడ్లకు సంబంధించిన భూములు ఆక్రమణలకు గురయ్యాయి. అందుకు నాయకులు కూడా వత్తాసు పలుకుతున్నారు. ఒకప్పుడు చటాన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నాగులపల్లి లింగారెడ్డిగూడ గ్రామాలు శివారు గ్రామాలుగా ఉండేవి. మూడు గ్రామాలకు కలిపి చటాన్‌పల్లిలో బంజరు దొడ్డి ఉండేది. ప్రస్తుతం అది అన్ని వైపులా ఆక్రమణకు గురైంది. విలువైన భూమి కబ్జాకు గురైనా ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామ కంఠంలో మిగులు భూమి ఉంటే ఆ భూమిని ప్రజా ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించాలి. ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలం, గ్రామానికి ఏదైనా ప్రభుత్వ కార్యాలయం మంజూరైతే భవన నిర్మాణానికి కేటాయించవచ్చు. కానీ భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకోకుండా గ్రామ కంఠం భూములను కబ్జా చేస్తున్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలో గ్రామ పంచాయతీల విభజనకు ముందు 27 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఒక్కో గ్రామ పంచాయతీలో సుమారు 5 గుంటల నుంచి 10 గుంటల వరకు బంజరు దొడ్లకు సంబంధించిన భూములు ఉన్నాయి. అందువల్ల ఏదేమైనా బంజరు దొడ్లు, గ్రామ కంఠం భూములపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు.

విచారణ చేపడతాం



ఫరూఖ్‌నగర్ మండలంలో గ్రామ కంఠం, బంజరు దొడ్డి భూములపై విచారణ చేస్తాం. గ్రామాల ప్రజలు కూడ ఆక్రమణల గురించి మా దృష్టికి తీసుకురావాలి. తగిన చర్యలు తీసుకుంటాం.

- జయంత్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి, ఫరూఖ్‌నగర్ మండలం

సీఐని కలిసిన నాయకులు


సీఐ గంగాధర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కడ్తాల సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గంగాధర్‌ను మంగళవారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీసు స్టేషన్‌లో కలిసి గంగాధర్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలంతా పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు. సురేందర్‌రెడ్డి, శంకర్, అశోక్, నరేందర్, బాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

మార్కెట్‌లో వసతుల కల్పనకు వినతి

ఆమనగల్లు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో తాగునీరు, విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలని ఏఎంసీ డైరెక్టర్ రవీందర్ కమిషనర్ శంకర్‌నాయక్‌ను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

కేశంపేటకు చేరుకున్న స్కూల్ యూనిఫామ్ క్లాత్

కేశంపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అందించే యూనిఫామ్ క్లాత్ కేశంపేటకు చేరుకుంది. మండలంలో 41 ప్రభుత్వ పాఠశాలల్లో 1204 మంది బాలురు, 1463 మంది బాలికలు చదువుకుంటున్నారు. వీరికి యూనిఫామ్ అందించేందుకు విద్యాశాఖ మంగళవారం క్లాత్ పంపించింది. 52 బేల్స్, 4062.34 మీటర్ల క్లాత్ వచ్చింది. డ్రెస్‌లుగా కుట్టడానికి మహిళాసంఘాల సభ్యులకు ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి అందించారు. బాటమ్‌క్లాత్ మాత్రమే వచ్చిందని, ఇంకా షర్ట్ క్లాత్ రాలేదని తెలిపారు. ఏపీఎం భగవంతు, సీసీలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిన ప్రశాంతత


పూజలో మధుసూదన్‌రెడ్డి తదితరులు

షాబాద్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పోలారం తండాలో శ్రీకృష్ణ మందిరం 21వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, అంజనేయులు, మారమ్మ, నాయకులున్నారు.

మూడింటికే..

- పీహెచ్‌సీ నుంచి పని నిమిత్తం మధ్యాహ్నం 3 గంటలకు వెళ్లిపోయిన వైద్యురాలు.. ఆపై సిబ్బంది కూడా ఇంటిముఖం


ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న వైద్యురాలి కుర్చీ, ఆసుపత్రి ఖాళీగా ఉన్నట్లు సీసీ కెమెరా తెరపై కనిపిస్తున్న దృశ్యం

కేశంపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వైద్యాధికారి పనుల మీద ఇతర ప్రాంతాలకు వెళితే సిబ్బంది సైతం ఇళ్లకు వెళ్లిపోతున్నారు. పీహెచ్‌సీ వైద్యురాలు నిఖిత మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల వరకు ఆసుపత్రిలో వైద్యసేవలు అందించి, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లారు. వైద్యురాలు అలా వెళ్లాగానే ఆసుపత్రిలో సేవలందించే ఎంపీహెచ్‌ఈవో, సూపర్‌వైజర్, కంప్యూటర్ ఆపరేటర్‌తో పాటు ఏఎన్‌ఎంలు వెళ్లిపోయారు. మూడున్నర గంటలకు ఆసుపత్రి ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చింది. సీసీ కెమెరాలు ఉన్నా సిబ్బంది వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శివాజీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లి సిబ్బంది లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం


రావిర్యాలలో కేంద్ర పథకాలను వివరిస్తున్న నాయకులు

చౌదరిగూడ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు విష్ణవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలు పిలుపునిచ్చారు. మంగళవారం రావిర్యాలలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజు, పోలింగ్ బూత్ అధ్యక్షుడు యాదయ్య ఆధ్వర్యంలో గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించి స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేయాలని సూచించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. చేనేత విభాగం రాష్ట్ర కన్వీనర్ మచ్చ సుధాకర్‌రావు, మాజీ మండలాధ్యక్షుడు కురుమయ్య, ప్రశాంత్, ప్రభు, గొల్ల రాజు, రాము, అనిల్, రాజు, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఘన సన్మానం



షాద్‌నగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ విద్యార్థులు 71.6శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 22మంది 90శాతానికి పైగా మార్కులు పొందగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి మంగళవారం సన్మానించారు. ప్రిన్సిపాల్ సర్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి లింగారెడ్డిగూడ అశోక్ తదితరులున్నారు.